క్లుప్తంగా

3న రాష్ట్రానికి చేరనున్న ఎల్లెల్సీ నీరు



ఆయకట్టు కింద సాగుచేసిన వరి పైరు

ఆలూరు: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రజలు, రైతులకు జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయానికి ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. దీంతో మూడురోజుల క్రితం టీబీ డ్యాం సెక్రటరీ నాగమోహన్, ఎస్సీ శ్రీనాథ్ రెడ్డి, ఈఈ నీలకంఠ రెడ్డి, డీఈ అమర్‌నాథ్‌రెడ్డి తాగు, సాగు నీటి అవసరాల కోసం గేట్లకు ప్రత్యేక పూజలు చేసి దాదాపు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కాలువ పనులకు దాదాపు పూర్తి చేశారు. ఆయకట్టు కింద వరి పంటను సాగు చేసుకునేందుకు బోర్డు అధికారులు అవకాశం కల్పించారని రైతులు, సాగునీటి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోర్ల కింద వరినారు సాగుచేసిన వారు ధరలు రెట్టింపు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 3వ తేదీకల్లా ఆంధ్ర సరిహద్దు హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సమీపంలో 136 కి.మీ కాలువకు నీరు చేరే అవకాశం ఉందని ఎల్లెల్సీ ఇంజినీర్లు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నందున మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి వారికి సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు చూపాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీడీసీఎల్, ఇపీడీసీఎల్, సీపీడీసీఎల్ సంస్థల్లో దాదాపు 4500 మంది దాదాపు 20 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్నారన్నారు. సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నందున వారికి ఉద్యోగ భద్రత కల్పించి వారి కుటుంబాలకు భరోసా ఇవ్వాలని కోరారు. స్మార్ట్ మీటర్లతో వారి ఉపాధి, ఉద్యోగాలకు ప్రమాదం వాటిల్లుతుందని, వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు విజయేంద్ర, ముక్తార్, నరసింహులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

జలాలను ఒడిసి పడదాం

మద్దికెర: వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి కరువును పారదోలుదామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రజలతో కలిసి 103 మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో ఒకే రోజు 30 కోట్ల మొక్కలు నాటడం జరిగిందని అలాగే ప్రతి రాష్ట్రంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మధ్యప్రదేశ్‌లో 50 వేల అమృత సరోవరాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. భూగర్భ జలాలు పెంపొందించుకోవడం వల్ల భవిష్యత్తులో నీటి సమస్య ఉండదన్నారు. బీజేపీ నాయకులు సోమశేఖర్‌గౌడ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

హాలహర్వి: క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు బోగోటప్ప, తిమ్మప్ప, శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని హర్ధగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బ్యాట్లు, వికెట్లు, ఇతర సామగ్రిని పీఈటీ వీరేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు పంపాపతి, సూర్యప్రకాష్, సురేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిని శిక్షించాలి

ఆస్పరి: ఆస్పరి మండలం వలిగొండ గ్రామంలో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు నెట్టికల్లు, సదర్శన్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు వలిగొండ దళిత కాలనీని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. దాడిలో గాయపడిన దళితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం

వెల్దుర్తి: జూనియర్ ఎన్టీఆర్ అభిమాని, పట్టణానికి చెందిన మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొంది ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ చౌదరి, ఉపాధ్యక్షుడు దామోదరయ్య స్వామి, జాఫర్, డోన్ ప్రతినిధులు చంద్రశేఖర్, రంగా రెడ్డి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు సుధాకర్ నాయుడుతో కలిసి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

అమ్మపాలు అమృతం

- రేపటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- బాలింతలకు అవగాహన కార్యక్రమాలు



కందనాతి గ్రామంలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: నవమాసాలు మోసి, పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనందం మాటల్లో చెప్పలేనిది. బిడ్డ భూమి పైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నే.. వెతికేది తల్లి పాలనే. శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయి. అమ్మ పాలు అమృతంతో సమానం. అయితే ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. బిడ్డకు తొలి ఆహారం అమ్మ పాలు, ఇది ప్రకృతి వరం. దీనికి మరేది సాటిరాదు. కొన్ని అపోహలు.. ఆధునిక పోకడలతో కొందరు తల్లులు వారి బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు ఏటా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏటా ఆగస్టు మొదటి వారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

వారోత్సవాల లక్ష్యం

మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) ఆగస్టు 1వ తేది నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే సభలు, సదస్సులు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు.

పలు ఔషధ గుణాలు

పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాపిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. బిడ్డ బరువు పెరిగేందుకు ఇవి దోహదపడతాయి. పగటి పూట ఇచ్చే పాలకన్నా రాత్రిపూట బిడ్డకు పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికీ, బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది. పాలిచ్చేటప్పుడు తల్లి ఒడిలో వేడి బిడ్డకు చేరి చాల వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తుంది. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

కేన్సర్ దూరం...

ప్రస్తుతం అనేక మంది స్త్రీలు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డకు పాలివ్వకపోవడమే. శిశువుకు తొలి ఆరు నెలలు బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి రొమ్ము కేన్సర్ బారినపడే అవకాశాలు చాలావరకు తగ్గుతాయి.

ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి



పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లిపాలివ్వాలి. బాలింతలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా రోజుకు 10 నుంచి 12 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డకు పాలు పడుకొని ఇవ్వరాదు, కూర్చోని పాలు పట్టాలి. బిడ్డ ఏడ్చిన ప్రతిసారీ పాలు పట్టించవచ్చు, ఆరు నెలలు వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది.

– డాక్టర్ మైత్రేయి, సూపరింటెండెంట్ ప్రభుత్వాసుపత్రి, ఎమ్మిగనూరు

ముర్రుపాల ఆవశ్యకత వివరిస్తున్నాం



అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి గర్భిణికి, బాలింతకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇచ్చేలా చేస్తున్నాం. తల్లిపాలు వారోత్సవాల ద్వారా అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నాం.

– సఫరున్నీసాబేగం, సీడీపీఓ, ఎమ్మిగనూరు

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల పునరావాస యోజనలో భాగంగా ప్రమాదవ శాత్తు, దీర్ఘ రోగాలతో కాళ్లు పోగొట్టుకున్న, పోలియో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఇస్తామన్నారు. అవసరం ఉన్న వారు ఆగస్టు 5వ తేదీలోగా 90000 88660, 81425 50143 నంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించే క్యాంప్‌లో మెడికల్ నిపుణులతో అవయవాల కోసం కొలతలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని సూగూరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆదివారం తెలిపారు. సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం మండల తహసీల్దార్‌కు పంపామని చెప్పారు. మాధవరం గ్రామానికి చెందిన ఎ.నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామంలో పీర్ల ఊరేగింపు సంబరాల్లో పాల్గొన్న గ్రామస్తులు



గుండ్లకొండ గ్రామంలో కొలువుదీరిన పీర్లు



పీర్ల దేవుళ్లను ఏటికి తీసుకెళ్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బుర్రకుంట, ఎం.కె.కొట్టాల, సింగాపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పీర్ల దేవుళ్లను ఏటికి తరలించారు. ఉదయం పీర్ల దేవుళ్లు అల్లాయ్ బల్లాయ్ తీసుకున్నారు. ఉదయం నుంచి పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పురవీధులగుండా ఊరేగిస్తూ పీర్ల దేవుళ్లను యేటికి తరలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎల్లెల్సీని పరిశీలించిన ఈఈ




హొళగుంద సెక్షన్‌లో తుంగభద్ర దిగువ కాలువను పరిశీలిస్తున్న ఈఈ, సెక్షన్ అధికారులు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సబ్ డివిజన్ 2, 3లోని హొళగుంద సెక్షన్ వరకు ఆదివారం ఎల్లెల్సీ కర్ణాటక ఈఈ నీలకంఠరెడ్డి పర్యటించారు. ఎల్లెల్సీకి ఈ నెల 28న నీరు విడుదల చేయడంతో కాలువలో నీటి ప్రవాహం, కాలువ పరిస్థితిని పరిశీలించారు. రైతులు అక్రమంగా నీటిని మళ్లించుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌డీఓ, సెక్షన్ ఆఫీసర్లకు సూచించారు. కాలువకు నీటి విడుదల అయినందున ఆంధ్రాకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు కృషి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలనంతరం డిస్ట్రిబ్యూటరీ (డీపీ)లకు ఇండెంట్ ప్రకారం నీరు విడుదల అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా అక్రమంగా నీటిని మళ్లించుకునే అవకాశాలున్న ప్రాంతాల్లో అరికట్టాలన్నారు. అలాగే కాలువ పరిధిలో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రధానంగా తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా కోటా నీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట హొళగుంద-3 ఎస్డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

జయప్రదం చేయండి

గోనెగండ్ల: మణిపూర్‌లో జరిగిన ఘటనపై దళిత ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని గోనెగండ్ల క్రీస్తు సంఘం పాస్టర్ ప్రసంగి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరిగిన సంఘటనలకు బాధ్యులుగా దళిత మహిళలపై దాడులను ఖండిస్తున్నామన్నారు. కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే దళితులపై దాడులను అరికట్టి, మహిళల గౌరవాన్ని కాపాడాలన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలకు నిరసనగా సోమవారం గోనెగండ్లలో దళిత ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే శాంతియాత్ర ర్యాలీని జయప్రదం చేసేందుకు వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పత్తికొండ డివిజన్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పత్తికొండ టౌన్: రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడతామని డివిజన్ నూతన అధ్యక్షుడు బి.నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు సమావేశమై, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రజనీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, వలిబాషా, టీఎండీ హుసేన్ వ్యవహరించారు. ఏపీఆర్ఎస్ఏ పత్తికొండ డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా జె.బాబు, ఉపాధ్యక్షులుగా రఘురామిరెడ్డి, ఈరమ్మ, బసవన్న గౌడ్‌తో పాటు కార్యదర్శి, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో పోరాడతామన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాఘవేంద్ర

మద్దికెర: ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పారా రాఘవేంద్ర ఎన్నికైనట్లు ఆయన ఆదివారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజ్ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మాదిగల సమస్యలను జిల్లా నాయకులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

క్రైం కార్నర్

తల్లి తిట్టిందని ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: ఆలూరు మండలంలోని హుళేబీడు గ్రామానికి చెందిన ఓబినమ్మ అనే యువతి ఆదివారం తల్లి తిట్టిందని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఓబినమ్మను గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి తిట్టడంతో యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వైద్య సిబ్బంది తెలిపారు. మెరుగైన చికిత్స కోసం యువతిని కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆలూరు: ఆలూరుకు చెందిన బోయ నరేష్, ఉగాది రాము మోటార్ బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆదివారం గ్రామం నుంచి చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి ఏపీ 39 కేటీ 7483 బుల్లెట్ బైక్‌పై బయలుదేరారు. హత్తిబెళగళ్ గ్రామ సమీపంలో ఉన్న కల్లెవంక వాగు వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. నరేష్‌కు కుడి చెంప, కాళ్లు, చేతులకు రక్తగాయాలయ్యాయి. అలాగే ఉగాది రాము కుడి చేతికి, ఛాతిపై రక్తగాయాలయ్యాయి. నరేష్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, రామును అనంతపురం జిల్లా గుంతకల్లుకు చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనాలలో బంధువులు తరలించారు. క్షతగాత్రులను జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, మండల కన్వీనర్ వీరేష్ తదితరులు వారిని పరామర్శించారు.

రెండు సెల్‌ఫోన్ల అపహరణ

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం సాయిమందిరం పక్కనే ఉన్న ఆర్టిస్టు వెంకీ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గాఢనిద్రలో ఉండగా తలుపు గడియ తీసి లోపలికి ప్రవేశించిన దుండగులు హాల్‌లో చార్జింగ్ పెట్టిన రూ.40 వేలు విలువ చేసే రెండు మొబైల్ ఫోన్లను తీసుకెళ్లినట్లు బాధితుడు కళ్యాణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



వేణు (ఫైల్)

వెల్దుర్తి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వేణు (34) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. వేణు గతంలో స్థానిక మేజర్ పంచాయతీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మేస్త్రీగా విధులు నిర్వహించాడు. ప్రస్తుతం మదనపల్లెలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా శనివారం అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మృతి చెందాడు. గుండెనొప్పితోపాటు, మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడమే కారణంగా తెలుస్తోంది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురాగా ఆదివారం పలువురు వైఎస్సార్‌పీ నాయకులు, మిత్రులు, నివాళులర్పించారు. భార్య కళ్యాణి, కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

వీధికుక్క దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన ప్రణీత్, దివ్య, ప్రమోద్

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులపై ఆదివారం వీధికుక్క దాడి చేయటంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ప్రమోద్, ప్రణీత్, దివ్య ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటుండగా వీధికుక్క వచ్చి దాడి చేసింది. చిన్నారులు భయంతో కేకలు వేయడంతో అక్కడున్న పరుగున వచ్చి కుక్కను తరిమేశారు. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చిన్నపిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కమ్మరచేడు గ్రామంలో పోలీసు పికెట్

- 28 మందిపై కేసు నమోదు



గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో మూడు రోజుల క్రితం మొహర్రం పండుగ సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 28 మందిపై పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ బి.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామంలో ఏపీఎస్పీ, సివిల్ పోలీసుల పికెట్ ఏర్పాటు చేసి పహారా కాస్తున్నారన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో గ్రామంలో ప్రశాంతత నెలకొందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అమకతాడు టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ జెండా అవిష్కరిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: అమకతాడు టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అమకతాడు సమీపంలో జాతీయ రహదారిలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఆయన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, ప్లాజా యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌తో కలిసి జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోల్‌ప్లాజాలో 10 సంవత్సరాలకుపైగా చాలీ, చాలనీ వేతనాలతో కార్మికులు పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. టీఏ, డీఏ ఇవ్వాలని, గతంలో కార్మికులకు టిఫిన్, భోజనం సౌకర్యం కల్పించేవారని కరోనా విజృంభణ తర్వాత ఈ సౌకర్యాలు పూర్తిగా నిలిపివేశారన్నారు. అలాగే డ్యూటీకి వచ్చే వారికి రాను, పోను ప్రయాణ ఖర్చులు కంపెనీ భరించాలని, కార్మికులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని కోరారు. డోన్ మండల కార్యదర్శి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, నాగమద్దయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాత్మక ఘటనలు అరికట్టాలి



ఎమ్మిగనూరులో ఎంబీ యెరుషలేం సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న సంఘ పెద్దలు

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్‌లో క్రైస్తవుల ఆస్తులను ధ్వంసం చేసి, మహిళను వివస్త్ర చేసి అఘాయిత్యానికి పాల్పడిన అమానవీయ ఘటనను నిరసిస్తూ ఆదివారం పట్టణంలో ఎంబీ యెరుషలేం సంఘం ఆధ్వర్యంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక చర్చి నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి స్థానిక మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి వినతి పత్రాలను ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం సోమప్ప, వైఎస్సార్ సర్కిల్, గాంధీ నగర్, శివ సర్కిల్ మీదుగా ర్యాలీని కొనసాగించారు. సంఘ పాస్టర్ జయన్న, కార్యదర్శి భాస్కర్‌బాబు తదితరులు మాట్లాడారు. మణిపూర్‌లో దళిత క్రైస్తవులపై దాడులను నిరోధించి బాధ్యులపై కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీకి స్థానిక ఎస్‌డీపీఐ సభ్యులు సంఘీభావం తెలిపారు.

ఎం.కొట్టాలలో ర్యాలీ

ఆలూరు: మణిపూర్ హింసాత్మక ఘటనలకు నిరసనగా మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో దళిత క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. దళిత క్రైస్తవుల మాన ప్రాణాలను కేంద్ర ప్రభుత్వం కాపాడాలని కోరారు. గ్రామంలో పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లో అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం మెతక వైఖరిని అనుసరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు దేవపుత్ర, ఆర్కే బుజ్జి దానప్ప, ఆనంద్, ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కోసిగి: మండల కేంద్రానికి చెందిన నాడుగేని కృష్ణ కర్ణాటక మద్యం బైక్‌పై తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం కృష్ణ పల్సర్ బైక్‌పై కర్ణాటక రాష్ట్రానికి చెందిన 10బాక్స్‌లు 90ఎంఎల్ 960 మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా పోలీసులను చూసి బైక్ మద్యం బాటిళ్లు పడేసి పరుగులు తీయగా వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడు, మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, బైక్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్‌ఐ నాగరాజు, కాశయ్య, రాఘవేంద్ర, మల్లికార్జున స్వామి పాల్గొన్నారు.





ఎల్.నగరంలో ప్రభుత్వ పథకాలు, లక్ష్యాలను ప్రతిబింబించేలా రూపుదిద్దుకుంటున్న సచివాలయ భవనం

అపురూపం.. ఆదర్శం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామ సచివాలయం భవనం రాష్ట్రానికే ఆదర్శంగా, దేవాలయంలా రూపుదిద్దుకుంటోంది. ఈ భవనాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ దేశాయ్ సమీర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నవరత్నాల పథకాలను ప్రతిబింబిస్తూ, ఆలయాల్లో ఉపయోగించే గ్రానైట్ రాయితో సర్వాగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ.35 లక్షలు దాటిపోయినా సొంతంగా ఖర్చు భరిస్తూ పనులు చేయిస్తున్నారు. 70 శాతం వరకు పనులు పూర్తయిన ఈ భవనం ఇప్పటికే పలువురిని ఆకర్షిస్తోంది. శిల్పకళాకారుల చాతుర్యం సచివాలయ భవనంలో తాండవిస్తోంది. సచివాలయ భవనం ఒక వైపు గ్రానైట్ రాయిని పొదిగించి, అందులో రాష్ట్ర చిహ్నాలతో పాటు పలు సంక్షేమ పథకాల నమూనా చిత్రాలను చెక్కారు. భవనం ముందు భాగం అత్యంత ఆకర్షణీయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రం, నవరత్నాల పథకాల నమూనా చిత్రాలను చెక్కారు.అలాగే స్వాగత సుమాంజలుల చిహ్నాలు ఆకర్షిస్తున్నాయి. లోపలి భాగంలో దేశభక్తికి తగ్గ చిహ్నాలు గోడలకు పెయింటింగ్ రూపంలో దిద్దనున్నట్లు నిర్మాణకర్త సమీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఖర్చుకు వెనుకాడడం లేదని, ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే తన తపన అన్నారు. భవనం పూర్తయితే రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.